సాక్షి
ఖమ్మం

మంగళవారం ౹ 4 ౹ జూన్ ౹ 2024



ఉద్యోగాల పేరిట గాలం

జిల్లా పెద్దాస్పత్రిలో ఉద్యోగాల పేరిట మోసానికి దిగిన ముఠా ప్రయత్నాలను అధికారులు ఆదిలోనే అడ్డుకున్నారు. 8లో



జగన్ మరోసారి సీఎం కావాలని..

ఏపీలో జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు సీఎం కావాలని ఆకాంక్షిస్తూ దివంగత వైఎస్సార్ అభిమానులు పూజలు నిర్వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 27°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.

లబ్‌డబ్.. లబ్‌డబ్!

నేడు లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు

- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం
- ఏకకాలంలో పోస్టల్ బ్యాలెట్లు, ఈవీఎంల లెక్కింపు ప్రారంభం
- ఖమ్మం నియోజకవర్గానికి 18.. మిగిలిన నియోజకవర్గాలకు 14 చొప్పున టేబుళ్లు
- ఉదయం 8 గంటలకు మొదలు... 21 రౌండ్లలో తుది ఫలితం



ఓట్ల లెక్కింపునకు హాల్‌లో చేసిన ఏర్పాట్లు



హాల్‌లో ఏర్పాట్లు సరిచూసుకుంటున్న ఉద్యోగులు


సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు మొదలవుతుంది. కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌లను అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షాన తెరిచాక ఈవీఎంలను కేంద్రంలోని టేబుళ్లపైకి చేర్చి ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేయనున్నారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ప్రత్యేక పరిశీలకుల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. కాగా, గతనెల 13న పోలింగ్ జరగగా, మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. అయినా ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు రామసహాయం రఘురాంరెడ్డి, నామా నాగేశ్వరరావు, తాండ్ర వినోద్‌రావు మధ్యే పోటీ నెలకొంది. ఈ మేరకు మంగళవారం ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా మొత్తం 21 రౌండ్లలో ఫలితం వెల్లడి కానుంది.

565 మంది ఏజెంట్లు

కౌంటింగ్ ప్రక్రియకు అంతా సిద్ధమైంది. ఇందు కోసం 1,500 మంది ఉద్యోగులను నియమించి శిక్షణ ఇచ్చారు. ఉదయం 8 గంటలకు మొదలయ్యే లెక్కింపు ప్రక్రియ మధ్యాహ్నం 3 గంటలకు పూర్తయ్యే అవకాశం ఉంది. అభ్యర్థుల తరఫున 565 మంది ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేశారు. ఇక విధులు నిర్వర్తించే ఉద్యోగులు మంగళవారం తెల్లవారుజామున 4గంటల్లోగా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. వీరికి టేబుళ్లను తుది విడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయిస్తారు.

ముందుగా అశ్వారావుపేట..

ఓట్ల లెక్కింపు ప్రక్రియ లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పర్యవేక్షణలో నిర్వహిస్తారు. అలాగే అదనపు రిటర్నింగ్ అధికారులతోపాటు ఒక్కో టేబుల్‌కు కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ చొప్పున ఉంటారు. వీరితో పాటు కంట్రోల్ యూనిట్లను టేబుల్‌పైకి తీసుకొచ్చే విధులు మరొకరు నిర్వర్తిస్తారు. ఇక ప్రతీ రౌండ్‌ను మైక్రో అబ్జర్వర్ పరిశీలిస్తారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఖమ్మంకు 18 టేబుళ్లు, పాలేరు, మధిర, సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలకు 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల సంఖ్య ఆధారంగా టేబుళ్లపై ఉన్న కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు పూర్తయితే ఒక రౌండ్‌గా పరిగణిస్తారు. ఈ మేరకు తొలుత తక్కువ పోలింగ్ కేంద్రాలు కలిగిన అశ్వారావుపేట నియోజకవర్గం లెక్కింపు 13 రౌండ్లలో పూర్తవుతుంది. ఆపై వైరా, కొత్తగూడెం 18 రౌండ్లలో, మధిర 19 రౌండ్లలో, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ లెక్కింపు 20 రౌండ్లలో, పాలేరు, సత్తుపల్లి 21రౌండ్లలో పూర్తికానుంది.



ఫలితాలు వెల్లడించేందుకు కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్

ఖమ్మం నియోజకవర్గంలో 355 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఒక్కో రౌండ్‌లో 18 కేంద్రాలకు సంబంధించి లెక్కించనుండడంతో ఇక్కడ 20 రౌండ్లలో పూర్తవుతుంది.

ఏకకాలంలో ప్రారంభం

ఓట్ల లెక్కింపునకు ఎనిమిది హాళ్లలో ఏర్పాట్లు చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కో హాల్‌తో పాటు పోస్టల్ బ్యాలెట్లు, సర్వీస్ ఓట్లకు మరో హాల్ కేటాయించారు. ఏకకాలంలో ఉదయం 8 గంటలకు అన్ని హాళ్లలో లెక్కింపు మొదలవుతుంది. పోస్టల్ బ్యాలెట్లు 10,687 ఉండగా సర్వీసు ఓట్లు 430 వరకు పోలయ్యాయి.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, రౌండ్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	రౌండ్లు
ఖమ్మం	355	20
పాలేరు	290	21
మధిర	258	19
వైరా	252	18
సత్తుపల్లి	294	21
కొత్తగూడెం	253	18
అశ్వారావుపేట	194	13
పోస్టల్ బ్యాలెట్లు	--	02

అరగంటకో రౌండ్

ఒక్కో రౌండ్ లెక్కింపునకు అర గంట పడుతుందని అంచనా వేస్తున్నారు. మొత్తం ఓట్లు లెక్కించాక గెలిచిన అభ్యర్థిని ప్రకటించి ధ్రువపత్రం అందజేస్తారు. ఈమేరకు కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడమే కాక నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతా దళాలను మోహరించారు.

ఇలా మొదలై...

- ★ ఖమ్మం నియోజకవర్గంలో లెక్కింపు రఘునాథపాలెం మండలం పాపటపల్లి నుంచి ప్రారంభమై ఖమ్మం అల్లీపురం పోలింగ్ కేంద్రం లెక్కింపుతో ముగుస్తుంది.
- ★ పాలేరులో తిరుమలాయపాలెం మండలం ముజాహిద్‌పురంలోని పోలింగ్‌కేంద్రం-1లో ప్రారంభమై నేలకొండపల్లి మండలం కొంగర పోలింగ్ కేంద్రం వద్ద ముగుస్తుంది.
- ★ మధిర నియోజకవర్గంలో ముదిగొండ మండలం మాదాపురం పోలింగ్ కేంద్రం వద్ద కౌంటింగ్ ప్రారంభవుతుంది. ఎర్రుపాలెం మండలంలోని కొత్తపాలెం పోలింగ్‌కేంద్రం వద్ద ముగియనుంది.
- ★ సత్తుపల్లి నియోజకవర్గానికి సంబంధించి తల్లాడ మండలం మల్లారం నుంచి ప్రారంభమై వేంసూరు మండలం భరణిపాడు వద్ద ముగుస్తుంది.
- ★ వైరా నియోజకవర్గంలో కారేపల్లి మండలం కొత్త కమలాపురం కేంద్రం వద్ద లెక్కింపు మొదలై వైరా మండలం గన్నవరం పోలింగ్ కేంద్రం వద్ద ముగియనుంది.
- ★ కొత్తగూడెం నియోజకవర్గంలో పాల్వంచ మండలం రేగులగూడెంలో లెక్కింపు ప్రారంభం అవుతుంది. సుజాతనగర్ మండలం గరీబ్‌పేట పోలింగ్ కేంద్రం ఓట్ల లెక్కింపుతో ముగుస్తుంది.
- ★ అశ్వారావుపేట నియోజకవర్గంలో ములకలపల్లి మండలం సీతారాంపురం ఓట్లతో లెక్కింపు ప్రారంభమై అశ్వారావుపేట మండలం కావడిగుండ్ల ఓట్లతో పూర్తవుతుంది.

16,31,039	12,41,135	1,896	117	21	1,500
ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ కేంద్రాలు	కౌంటింగ్ టేబుళ్లు	రౌండ్లు	ఉద్యోగులు

అన్ని ఏర్పాట్లు చేశాం...

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. లెక్కింపు కేంద్రమైన ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలను.. సాధారణ పరిశీలకులు డాక్టర్ సంజయ్ జి కోల్టే, కౌంటింగ్ పరిశీలకులు ప్రేదిమాన్ కృషన్ భట్‌లతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఇప్పటికే శిక్షణ పూర్తికాగా ర్యాండమైజేషన్ ద్వారా టేబుళ్లు కేటాయించామని తెలిపారు. కేంద్రం వద్ద భారీ భద్రత కల్పించడంతో పాటు ఫలితాల వెల్లడికి మీడియా సెంటర్ సైతం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమై సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సహాయ రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్ సురభి, బి.సత్య ప్రసాద్, వేణుగోపాల్, ఎం.రాజేశ్వరి, జి.గణేష్, ఎల్.రాజేందర్, మధు, ఉద్యోగులు రాళ్లబండి రాంబాబు, శ్రీనివాసరెడ్డి, అరుణ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఆర్‌ఓ, కలెక్టర్ గౌతమ్, పరిశీలకులు సంజయ్ జి.కోల్టే, పెద్రిమాన్ కృషన్‌భట్

న్యూస్‌రీల్

ఈవ్‌టీజింగ్ ఎదురైతే ఫిర్యాదు చేయండి

ఖమ్మంక్రైం: మహిళలు, విద్యార్థినులు ఈవ్‌టీజింగ్‌కు గురైతే షీ టీమ్ సెల్ నంబర్ 8712659222కు సమాచారం ఇవ్వాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఓ ప్రకటనలో సూచించారు. కమిషనరేట్ వ్యాప్తంగా షీ టీమ్ బృందాలతో నిఘా కొనసాగుతోందని తెలిపారు. అలాగే, సోషల్ మీడియా వేదికగా వేధింపులు ఎదురైనా షీ టీమ్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఇటీవల తల్లాడ ప్రాంతానికి చెందిన యువతికి ఇన్‌స్టాగామ్ ద్వారా ఓ వ్యక్తి పరిచయమై అడిగిన డబ్బు ఇవ్వకపోవడంతో ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానంటూ బ్లాక్ మెయిల్ చేయగా యువతి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని తెలిపారు. ఈమేరకు యువతులు, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేసి ఆకతాయిల ఆట కట్టించేందుకు సహకరించాలని సూచించారు. కాగా, గత మే నెలలో ఈ అంశంపై 13 ఫిర్యాదులు అందగా కేసు నమోదు చేశామని తెలిపారు. అంతేకాక 48 చోట్లఅవగాహన సదస్సులు నిర్వహించామని సీపీ వెల్లడించారు.

144 సెక్షన్.. మద్యం షాపుల బంద్

ఖమ్మంక్రైం: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుండగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ విధించినట్లు సీపీ సునీల్‌దత్ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మంగళవారం ఉదయం 6నుండి బుధవారం ఉదయం 6గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. ఈ నేపథ్యాన గుంపులుగా గుమికూడొద్దని, సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి ఉండదని తెలిపారు. అలాగే, మంగళవారం జిల్లావ్యాప్తంగా బార్లు, వైన్స్‌లు, మద్యం సరఫరా చేసే క్లబ్‌లు, రెస్టారెంట్లు మూసివేయాలని సీపీ ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఏఓ విజయనిర్మల

చింతకాని: రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలను విక్రయిస్తే వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల హెచ్చరించారు. మండలంలోని నాగులవంచలో పలు విత్తన దుకాణాల్లో సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించడంతో పాటు రైతులకు పూర్తి వివరాలతో కూడిన రశీదు ఇవ్వాలని సూచించారు. లైసెన్స్ కలిగిన డీలర్లు మాత్రమే విత్తనాలను విక్రయించాలని తెలిపారు. ఇక రైతులు సైతం ఒకే రకం విత్తనాలపై ఆసక్తి చూపకుండా 8 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వచ్చే బీజీ-2 పేరుతో ఉన్న ఏ పత్తి విత్తనాలైనా కొనగోలు చేయొచ్చని వెల్లడించారు. అంతేతప్ప కంపెనీల ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని డీఏఓ సూచించారు. తనిఖీల్లో మధిర ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, ఏఓ పల్లెల నాగయ్య పాల్గొన్నారు.

రెన్యూవల్ చేసుకున్న వారికీ రుణమాఫీ



బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌ఎం రియాజ్

పెనుబల్లి: అన్ని బ్యాంకుల్లో కల్లా అత్యుత్తమ డిపాజిట్లు వడ్డీ రేటు ఏపీజీవీబీలో మాత్రమేనని బ్యాంకు రీజినల్ మేనేజర్ రియాజ్ వెల్లడించారు. ఖమ్మం జిల్లా పెనుబల్లిలోని ఏపీజీవీబీ శాఖ నూతన భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ రెన్యువల్ చేసుకున్న రైతులకు కూడా వర్తిస్తుందని తెలిపారు. ఈ విషయంలో అపోహలకు గురికావొద్దని సూచించారు. ప్రతీ రైతు సకాలంలో రుణాన్ని రెన్యువల్ చేయించుకోవాలని.. తద్వారా ప్రభుత్వ రాయితీలు అందుతాయని వెల్లడించారు. అలాగే, డైరీ ఫామ్‌లు, పెట్రోల్‌బంక్‌ల ఏర్పాటు, ట్రాక్టర్లు, హార్వెస్టర్ల కొనుగోలుకు రుణాలు ఇస్తున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. ఈకార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అన్సర్, ఫీల్డ్ ఆఫీసర్ పృథ్వీ, ఉద్యోగులు అనిల్, హారిక, వరలక్ష్మి, శ్రావణలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గెలుపా.. మెజార్టీనా ?!

- విజయంపై ధీమాతో అభ్యర్థులు, నేతలు
- నియోజకవర్గాల వారీగా ఎక్కడ పైచేయి అవుతుందనే ఉత్కంఠ
- ప్రచారం, పోలింగ్ పరిశీలనతో అంచనాకు వచ్చిన అభ్యర్థులు



రఘురాంరెడ్డి



నామా నాగేశ్వరరావు



తాండ్ర వినోద్‌రావు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో గెలుపుపై అభ్యర్థులు ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. గెలుపు ఖాయమనే అంచనాకు రావడంతో పాటు మెజార్టీ ఎంత వస్తుందనే అంశంపైనే చర్చలు సాగిస్తుండడం గమనార్హం. ప్రచారం, పోలింగ్ సరళిని బేరీజు వేసుకున్న అనంతరం ప్రధాన పార్టీల అభ్యర్థులు అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. పోలింగ్, ఓట్ల లెక్కింపునకు మధ్య 21 రోజుల సమయం ఉండడంతో పోలింగ్ సరళి, బూత్‌ల వారీగా పోలైన ఓట్లను పరిశీలించి ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా చెబుతున్నారు. భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని కాంగ్రెస్.. స్వల్ప ఓట్ల మెజార్టీతోనైనా తమదే గెలుపని బీఆర్‌ఎస్, బీజేపీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా, మధ్యాహ్నం మూడు గంటలకల్లా విజేత ఎవరో తేలిపోనుంది.

భారీగా పై'చేయి'

కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఆ పార్టీ శ్రేణులు గట్టి నమ్మకంతో ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని మొత్తం ఏడు నియోజకవర్గాలకు గాను ఆరింట కాంగ్రెస్ అభ్యర్థులు, ఒక నియోజకవర్గంలో మిత్రపక్షమైన సీపీఐ గెలుపొందడంతో ఈసారి తమ గెలుపు నల్లేరుపై నడకేనని అంచనాలో ఉన్నారు. అయితే అలసత్వానికి తావివ్వకుండా పూర్తిస్థాయిలో ప్రచారం నిర్వహించడంతోపాటు పోల్ మేనేజ్‌మెంట్‌పైనా పార్టీ దృష్టి పెట్టింది. అభ్యర్థి తరఫున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. ఈ నేపథ్యాన కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి గెలవడమే కాక 2 లక్షలకు పైగా మెజార్టీ సాధిస్తారని పార్టీ కేడర్, నేతల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బీఆర్‌ఎస్‌లో ధీమా

బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయం ఖాయమని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. సిట్టింగ్ స్థానం కావడం, గత శాసనసభ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిందనే సానుభూతి ఉండడంతో ఓటర్లు తమకు పట్టం కడతారని నేతలు నమ్మకంతో ఉన్నారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి, గులాబీ దళపతి కేసీఆర్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి జరి గిన అభివృద్ధిని వివరించారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహా ఇతర నేతలు పూర్తిస్థాయిలో ప్రచారం చేశారు. ఈ క్రమంలోనే అభ్యర్థి నామా నాగేశ్వరరావు తన గెలుపు ఖాయమనే అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే, భారీ మెజార్టీ రాకపోయినా స్వల్ప మెజార్టీతోనైనా గెలవడం పక్కా అనే ఉద్దేశంతో ఆ పార్టీ నేతలు, అభ్యర్థి ఉన్నారు.

కమలం వికసిస్తుందని..

ఖమ్మం పార్లమెంట్ స్థానం విషయంలో మొదటి నుంచి బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. అందరికంటే ముందుగానే అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావును ప్రకటించడంతోపాటు ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే నియోజకవర్గ వ్యాప్తంగా ఒక విడత ప్రచారం పూర్తి చేసింది. నియోజకవర్గవ్యాప్తంగా వినోద్‌రావు సుడిగాలి పర్యటన చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఆయనతోపాటు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పలువురు నేతలు ప్రచారం నిర్వహించారు. ఓటింగ్ సరళిని పరిశీలించిన అనంతరం దేశంలో, రాష్ట్రంలో బీజేపీ హవా ఉన్నందున.. మోదీ చరిష్మాతో తన గెలుపు ఖాయమని వినోద్‌రావు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దేశంలో మరోసారి అధికారంలోకి రావడంతోపాటు రాష్ట్రంలోనే అత్యధిక పార్లమెంట్ స్థానాలను బీజేపీ గెలవనుందని, జాబితాలో ఖమ్మం కూడా ఉంటుందని నేతలు గట్టి నమ్మకంతో ఉన్నారు. ఖమ్మంలో వచ్చే అనూహ్య ఫలితంతో బీజేపీ సత్తా చాటుతామని చెబుతున్నారు.

నేతలంతా ఖమ్మంలోనే..

లోక్‌సభ ఓట్ల లెక్కింపు నేపథ్యాన ప్రధాన పార్టీల నేతలంతా సోమవారం రాత్రి ఖమ్మం చేరుకున్నారు. రౌండ్ల వారీగా ఎన్ని ఓట్లు వస్తాయో తమ ఏజెంట్ల ద్వారా తెలుసుకునేందుకు సమాయత్తమయ్యారు. ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకం కాగా.. బీఆర్‌ఎస్, బీజేపీకి సైతం సవాల్‌గా మారాయి. దీంతో పోలింగ్ తర్వాత ఇన్నాళ్లూ విశ్లేషణ చేసుకున్న నేతలంతా తమ అభ్యర్థుల ఓట్ల వివరాలు ఎప్పటికప్పుడు ఆరా తీసేందుకు సిద్ధమయ్యారు.

పదేళ్లలో ఒక్క ఇల్లూ ఇవ్వని బీఆర్‌ఎస్

- పేదలను విస్మరించిన ఆ పార్టీ నేతలకు మాట్లాడే హక్కు లేదు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కొత్తకొత్తూరు సభలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన నాయకులు


నేలకొండపల్లి: పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి సోమవారం పర్యటించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాల్లో ప్రజల నుంచి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అధికారంలో ఉన్నన్నాళ్లు పేదలను పట్టించుకోని బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. పేదలు, వారి సంక్షేమాన్ని విస్మరించిన ఆ పార్టీకి మాట్లాడే అర్హత లేదని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనుండగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ఒక స్థానం కూడా వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. కాగా, పేదవారి ప్రభుత్వం రావడంతో రోహిణి కార్తెలోనే వర్షాలు కురుస్తున్నాయని మంత్రి అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశంతో ఈ స్థాయికి వచ్చానని, లోక్‌సభ ఎన్నికల్లోనూ పాలేరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ముగియగానే ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని, అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించడంతో పాటు ఏడాదిలోగా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తిచేస్తామని మంత్రి ప్రకటించారు. ఈ సమావేశాల్లో ఎంపీపీ వజ్జా రమ్య, నాయకులు శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, నల్లాని మల్లికార్జున్‌రావు, జానకిరామయ్య, చెరువు స్వర్ణ, కొడాలి గోవిందరావు, బొందయ్య, మైశా శంకర్, హనుమంతరావు, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్, కొమ్మినేని విజయ్‌బాబు, ఇస్లావత్ బాలాజీ, సుల్తాన్ వీరబాబు, మానుకొండ వెంకటేశ్వరావు, వేగినాటి లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి...


ఖమ్మంవన్‌టౌన్: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రజలు వేసిన ప్రతీ ఓటు కీలకమైనదేనని చెప్పారు. ఖమ్మంలో సోమవారం సాయంత్రం ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లతో మంత్రి సమావేశమై మాట్లాడారు. మొదటి ఈవీఎం మెషీన్ సీల్ తీసింది మొదలు లెక్కింపు పూర్తయ్యే వరకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సమయానికి లెక్కింపు కేంద్రం వద్దకు చేరుకోవాలని, ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, నాయకులు తుమ్మల యుగంధర్, మహ్మద్ జావీద్, బొర్రా రాజశేఖర్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కోనేరు చిన్ని, పొంగులేటి ప్రసాదరెడ్డి, చావా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో సత్తా

- జిల్లా విద్యార్థి హరీశ్‌కు రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు
- ఎంపీసీ, ఎంబైపీసీ విభాగాల్లో పలువురికి ఉత్తమ ర్యాంకులు



యంసాని హాశీశ్




గుండు అనన్య

ఖమ్మం సహకారనగర్/పెనుబల్లి: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి గత నెల 24వ తేదీన పాలిసెట్ నిర్వహించారు. జిల్లా నుంచి పరీక్షకు 2,591మంది విద్యార్థులకు గాను 2,212మంది విద్యార్థులు హాజరు కాగా ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యార్థులు ఎంపీసీ, ఎంబైపీసీ విభాగాల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం విశేషం. జిల్లాలోని పెనుబల్లి మండలం మండాలపాడుకు చెందిన రమేష్ సైక్ స్కూల్ విద్యార్థి తుమ్మటి హరీశ్ ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 120కి 120 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా.. ఎంబైపీసీలో 7వ ర్యాంకు సాధించాడు. అలాగే, ఖమ్మంలోని త్రివేణి పాఠశాల విద్యార్థిని ఏపూరి మోక్షిత సాయి ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంక్ సాధించింది.

జిల్లా స్థాయిలో...

పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల రాష్ట్రస్థాయి ర్యాంకులతో పాటు జిల్లా స్థాయి ర్యాంకులను సైతం ప్రకటించారు. ఈమేరకు జిల్లాస్థాయిలో ఎంపీసీకి సంబంధించి వరుసగా మండాలపాడుకు చెందిన తుమ్మటి హరీశ్, తాళ్లూరి వెంకటాపురానికి చెందిన యంసాని హాశీశ్, ఖమ్మంకు చెందిన ఏపూరి మోక్షిత సాయి మూడు స్థానాల్లో నిలిచారు. ఇక ఎంబైపీసీ విభాగంలో తుమ్మటి హరీశ్, ఏపూరి మోక్షిత సాయి, ఖమ్మంకు చెందిన గుండు అనన్య మొదటి మూడు ర్యాంకులు చేజిక్కించుకున్నారు.


ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతా...



మా అమ్మ అంగన్‌వాడీ టీచర్‌గా, నాన్న షాపులో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. పాలిసెట్‌లో మంచి ర్యాంకు వస్తుందని అనుకున్నప్పటికీ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవాలన్నది లక్ష్యం.

– తుమ్మటి హరీశ్, ఎంపీసీ రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంక్

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనేది నా లక్ష్యం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఉన్న నేపథ్యాన తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో చదివి పాలిసెట్‌లో రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంక్ సాధించా. ఇదే ఉత్సాహంతో చదివి ఉన్నత స్థాయికి చేరుతా.

– ఏపూరి మోక్షిత సాయి, ఎంపీసీ రాష్ట్రస్థాయి 10వ ర్యాంక్

క్లుప్తంగా

పెద్దాస్పత్రిలో సెంట్రల్ ల్యాబ్



సెంట్రల్ ల్యాబ్‌లో ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ మాలతి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సెంట్రల్ ల్యాబ్ సేవలు ప్రారంభమయ్యాయి. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి ల్యాబ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ ఏడాది సెప్టెంబర్ నుండి ఎంబీబీఎస్ రెండో సంవత్సర తరగతులు మొదలు కానుండగా, పాథాలజీ, మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయి. ఇందు కోసం అవసరమైన సెంట్రల్ ల్యాబ్‌ను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఆస్పత్రికి వచ్చే వారి నుంచి సేకరించిన రక్త నమూనాలను తెలంగాణ డయోగ్నస్టిక్స్ హబ్‌కు పంపిస్తుండడంతో నివేదికలు రావడానికి 24 గంటలు పడుతోంది. ఇప్పుడు ఆస్పత్రికి అనుసంధానంగా ఏర్పాటైన మెడికల్ కళాశాలలో సెంట్రల్ ల్యాబ్ ఏర్పాటు కావడంతో అత్యవసర రోగుల నివేదికలు రెండు గంటల్లోనే అందుతాయి. సెంట్రల్ ల్యాబ్‌లో 70 రకాల అత్యవసర పరీక్షలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ బాబు రత్నాకర్, సెంట్రల్ ల్యాబ్ ఇన్‌చార్జ్ రమాదేవి, పాథాలజిస్టులు బాలు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పాత కేసులు ఉన్నాయని పోడుదారులకు నోటీసులు



ఫారెస్టు కార్యాలయం వద్ద నోటీసులతో రైతులు

కారేపల్లి: పాత కేసుల విచారణకు రావాలని కారేపల్లి ఫారెస్టు రేంజ్ కార్యాలయం నుంచి అధికారులు పలువురు పోడుదారులకు నోటీసులు జారీ చేశారు. కారేపల్లి ఫారెస్టు బీట్ పరిధిలో 2017నుంచి 2019వ సంవత్సరం వరకు పోడుకు సంబంధించిన కేసులు నమోదైనందున కారేపల్లికి చెందిన పాసిన్ని నాగేశ్వరరావు, పాలిక చిన్నసారయ్య, చెవుల కృష్ణ, రామగిరి కృష్ణకు నోటీసులు ఇచ్చారు. దీంతో వారు సోమవారం ఉదయమే ఫారెస్టు రేంజ్ కార్యాలయానికి చేరుకోగా, అక్కడ అధికారులెవరూ లేకపోవడంతో పొద్దంతా పడిగాపులు కాయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 60ఏళ్లుగా తరతరాల నుంచి వారసత్వంగా వచ్చిన పోడు భూమిలో వ్యవసాయం చేసుకుంటున్న తమను కేసుల పేరిట ఇబ్బంది పెట్టొద్దని వారు కోరారు.

దత్తత ఇచ్చిన, తీసుకున్న వారిపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం దానవాయిగూడెంకు చెందిన దంపతులు తమకు జన్మించిన మగ శిశువును అక్రమంగా దత్తత ఇచ్చిన వ్యవహారంలో రెండు జంటలపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు. దానవాయిగూడెంకు చెందిన దుర్గాభవాని – సాయికి జన్మించిన రెండు నెలల మగ శిశువును చట్టవిరుద్ధంగా ఇంకొకరికి దత్తత ఇచ్చారు. ఈ విషయం బయటపడడంతో సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు విచారణ చేశారు. అనంతరం జూబ్లీపుర సెక్టార్ సూపర్‌వైజర్ ఫిర్యాదుతో దత్తత ఇచ్చిన వారితో పాటు తీసుకున్న దంపతులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగాల పేరిట గాలం

- నకిలీ అపాయింట్‌మెంట్ లేఖతో బురిడీకి యత్నం
- డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ కమిషనర్ పేరుతో ఆర్డర్లు
- ఒక్కో పోస్టుకు రూ.3 లక్షల వసూలుకు వ్యూహం
- ఆస్పత్రి ఉద్యోగులు స్పందించడంతో అక్రమానికి అడ్డుకట్ట



ఓ నిరుద్యోగికి ఇచ్చిన నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్

ఖమ్మంవైద్యవిభాగం: ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు గాలం వేయాలని చూసింది ముఠా. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగుల నుండి రూ.లక్షల్లో వసూలుకు నిర్ణయించింది. అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు కూడా సిద్ధం చేసి ఇచ్చిన ముఠా సభ్యులు ఏకంగా ఆస్పత్రి ఆవరణలోనే శిక్షణ పేరిట మరో బాగోతానికి తెరతీశారు. అయితే, ఓ అభ్యర్థి ఆస్పత్రి ఉద్యోగికి విషయం చెప్పడంతో ఆయన అధికారులకు సమాచారం ఇవ్వగా బండారాన్ని బట్టబయలు చేశారు.



ఆస్పత్రిలో పట్టుబడిన నిందితులు

పెద్దాస్పత్రిలో సూపర్‌వైజర్లుగా..

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సూపర్‌వైజర్ ఉద్యోగం ఇప్పిస్తామని కొందరు నిరుద్యోగులకు ఓ ముఠా గాలం వేసింది. ఈక్రమంలో రూ.3లక్షల చొప్పున చెల్లించేలా బేరం కుదుర్చుకోగా నలుగురు ముందుకొచ్చారు. వీరికి ఈనెల 1న పెద్దాస్పత్రిలోని కార్డియాలజీ విభాగంలో నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వడమే కాక సోమవారం శిక్షణకు హాజరుకావాలని సూచించారు. శిక్షణ అనంతరం డబ్బు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే, అపాయింట్‌మెంట్ తీసుకున్న ఓ వ్యక్తికి ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ విభాగం ఉద్యోగి వినయ్‌తో పరిచయం ఉండడంతో విషయాన్ని తెలిపాడు. ఆయన ఆస్పత్రి అధికారులకు తెలియచేయడంతో వారు నిఘా వేశారు. ఇదంతా తెలియని ముఠా సభ్యులు తమ అనుచరులైన విజయగిరి శ్రీనివాస్, కోత్తపల్లి సత్యనారాయణను సోమవారం కార్డియాలజీ విభాగానికి పంపించారు. అక్కడ నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చినట్లుగా నమ్మించి డబ్బు తీసుకోవాలని భావించారు. ఈక్రమంలోనే ఖాళీ గది కోసం వెతుకుతుండగా ఆస్పత్రి ఉద్యోగులు వారిద్దరి పట్టుకుని గదిలో బంధించి ఖమ్మం టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. కాగా అపాయింట్‌మెంట్ ఆర్డర్లను వైద్య విధాన పరిషత్ డిప్యూటీ కమిషనర్, డీఎంహెచ్‌ఓ పేరుతో సృష్టించగా వైద్య విధాన పరిషత్‌లో డిప్యూటీ కమిషనర్ పోస్టు అనేదే ఉండదని తెలియక బోల్తా పడ్డారు. ఇక తన సంతకం ఫోర్జరీ అయిందన్న సమాచారంతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి మరో ఫిర్యాదు చేశారు. అయితే, ముఠా సభ్యులు నేరుగా రాకుండా తమ అనుచరులు పంపించడంతో దొరికిపోగా కీలక పాత్ర పోషించిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఒక నిరుద్యోగి ఆస్పత్రిలో ఉద్యోగం వచ్చిందని ఆర్డర్‌తో రాగా అలాంటి పోస్టు ఏమీ లేదని అధికారులు పంపించినట్లు తెలిసింది. దీంతో ముఠా వలలో ఎందరు నిరుద్యోగులు చిక్కుకున్నారో తేలాల్సి ఉంది.

తండ్రీకొడుకులను బలిగొన్న లారీ

- కిష్టారం వద్ద రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి
- తల్లిని ఆస్పత్రిలో చేర్పించి వస్తున్న కుమారుడు, మనవడి మృత్యువాత



పిల్లి పీరయ్య, అశోక్ (ఫైల్)

సత్తుపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని ఆస్పత్రిలో చేర్పించి వస్తున్న కుమారుడు, ఆమె మనవడిని లారీ రూపంలో మృత్యువు వెంటాడింది. సత్తుపల్లి మండలం కిష్టారం సమీపాన సోమవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. కిష్టారం గ్రామానికి చెందిన పిల్లి పీరయ్య (52) తల్లి చిట్టెమ్మ అనారోగ్యంతో బాధపడుతుండడంతో సత్తుపల్లిలోని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి పీరయ్య, ఆయన కుమారుడు అశోక్(30) ద్విచక్ర వాహనంపై కిష్టారం వస్తున్నారు. ఈక్రమంలో సింగరేణి బైపాస్‌రోడ్డులోని కిష్టారం ఓసీ సమీపాన ఖమ్మంవైపు నుంచి ఎదురుగా వచ్చిన లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో పీరయ్య, అశోక్ తీవ్రంగా గాయపడి ఎగిరి రోడ్డు పక్కన చెట్లపొదల్లో పడిపోయారు. రహదారి వెంట వెళ్లేవారు గమనించి క్షతగాత్రులను సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో ఇద్దరూ మృతి చెందారు. అయితే, వీరిని ఢీకొట్టిన లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్తుండటంతో స్థానికులు పట్టణంలోని వెంగళరావునగర్ వరకు ద్విచక్రవాహనాలతో వెండించి అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. కాగా, పీరయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు అశోక్ మృతి చెందగా, ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంబేద్కర్‌నగర్‌లో విషాదం

కిరాణ దుకాణం నడుపుతూ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న తండ్రీకొడుకులు పీరయ్య, అశోక్ మృతితో కిష్టారంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో విషాదం అలుముకుంది. కాలనీవాసులు, బంధువులు పెద్దసంఖ్యలో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. కాగా, మృతదేహాల వద్ద సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మూడేళ్ల సర్వీస్ నిండిన వారి సమాచారం ఇవ్వండి

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్ల(ఏఈ) బదిలీలు జరుగుతాయని ప్రచారం నేపథ్యాన పూర్తి సమాచారం ఇవ్వాలని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి జిల్లాల సర్కిల్ ఆపరేషన్స్ కార్యాలయాలకు సోమవారం ఆదేశాలు అందాయి. మూడేళ్ల సర్వీసు నిండిన వారి వివరాలను రెండు రోజుల్లో ఇవ్వాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. సుదీర్ఘకాలంగా ఒకే జిల్లా, సెక్షన్, ప్రాంతంలో పనిచేసే వారి వివరాలు కూడా పంపించాలని అందులో పేర్కొన్నట్లు తెలిసింది. త్వరలో విడుదలయ్యే మార్గదర్శకాల ఆధారంగా ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఏఈల బదిలీ జరిగే అవకాశముందని సమాచారం. ఖమ్మం జిల్లాలో 45 మంది, భద్రాద్రి జిల్లాలో 34 మంది కలిపి 79మంది ఏఈలు విధులు నిర్వర్తిస్తుండగా, 40 నుంచి 50 మంది బదిలీ కావొచ్చని తెలిసింది. ఇందులో కొందరికి సర్కిల్ పరిధిలో, ఇంకొందరికి జిల్లాల స్థాయిలో బదిలీ అయ్యే అవకాశముందన్న చర్చ జరుగుతోంది. ఆతర్వాత ఏడీఈ, డీఈల బదిలీలు కూడా ఉంటాయని చెబుతున్నారు.

మద్యం మత్తులో దాడి..

సీసా ముక్కలు తాకాయని కొట్టడంతో వ్యక్తి మృతి



నాగేంద్రబాబు (ఫైల్)

బోనకల్: మద్యం మత్తులో ఓ వ్యక్తిపై ఇద్దరు యువకులు విచక్షణారహితంగా దాడి చేయడంతో సదరు వ్యక్తి మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం వేములనరం గ్రామానికి చెందిన ఉయ్యాల నాగేంద్రబాబుకు ఏడాది క్రితం గుంటూరు జిల్లా అచ్చెంపేట మండలం శల్లగరికకు చెందిన నాగసత్యతో వివాహం జరిగింది. నాగేంద్రబాబు తన భార్యతో కలిసి శల్లగరికలో ఉంటుండగా, వేములనరంలో తల్లిని చూసేందుకు ఇటీవల వచ్చాడు. ఈక్రమాన ఖమ్మం జిల్లా బోనకల్‌లోని వైన్ షాపు వద్దకు ఆదివారం రాత్రి వచ్చిన ఆయన మద్యం తాగాక బీరు సీసాలు పగులగొట్టాడు. ఆపై సీసా ముక్కలను విసరడంతో సమీపాన మద్యం తాగుతున్న బొబ్బిల ఉపేందర్, మోర్ల పరశురాం వద్ద పడ్డాయి. ఈక్రమంలో వారు నాగేంద్రబాబుతో ఘర్షణకు దిగగా వైన్స్ నిర్వాహకులు బయటకు పంపించారు. బయటకు వచ్చాక నాగేంద్రబాబుపై ఉపేందర్, పరశురాం విచక్షణా రహితంగా రాయితో దాడి చేయయగా నాగేంద్రబాబు వత్సవాయి – బోనకల్ మధ్య సాగర్ బ్రిడ్జి సమీపాన స్పృహ తప్పి పడిపోయాడు. ఈవిషయాన్ని గమనించిన బోనకల్‌కు చెందిన ఓ వ్యక్తి వేములనరంలో ఉన్న నాగేంద్ర మిత్రుడికి సమాచారం ఇవ్వగా ఆయన కుటుంబీకులతో కలిసి వచ్చి ఆటోలో అతడిని ఇంటికి తీసుకెళ్లి అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి కితరలించగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేయగా, వైరా ఏసీపీ అబ్దుల్ రహమాన్, సీఐ మధుబాబు, ఎస్‌ఐ మధు వివరాలు ఆరా తీసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

పోలీసుల అదుపులో గంజాయి స్మగ్లర్లు?

కారేపల్లి: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులు కారేపల్లి పోలీసులకు సోమవారం పట్టుబడినట్లు తెలిసింది. ఇల్లెందు పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు సుమారు అరకేజీ గంజాయితో ఇల్లెందు నుంచి చీమలపాడువైపు వెళ్తుండగా పోలీసులు పక్కా సమాచారంతో అటకాయించి పట్టుకున్నారని సమాచారం. చీమలపాడులోని ఓ వ్యక్తికి గంజాయి ఇచ్చేందుకు వెళ్తున్నట్లు విచారణలో వారు చెప్పడంతో పోలీసులు చీమలపాడుకు వెళ్లే సరికి సదరు యువకుడు తప్పించుకున్నట్లు తెలిసింది.

ఆలయంలో చోరీ

ముదిగొండ: ముదిగొండలోని కంఠమహేశ్వరస్వామి ఆలయం తాళం పగలగొట్టిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలిలాలా ఉన్నాయి. కంఠహేశ్వర స్వామి ఆలయం తాళాలను ఆదివారం అర్ధరాత్రి దాటాక పగులగొట్టిన వ్యక్తులు రూ.14వేల విలువైన అమ్మవారి పుస్తెలు, రూ.8వేల విలువైన వెండి వస్తువులు, రూ.3వేలు విలువైన ఇత్తడి వస్తువులను చోరీ చేశారని కమిటీ నిర్వాహకులు మల్లారపు శ్రీను, తేరాల రామారావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రుతుపవనాలు వచ్చేశాయ్!

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం

ఖమ్మంవ్యవసాయం: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు అధికారిక వర్గాలు ప్రకటించాయి. ఏటా జూన్ రెండోవారంలో వచ్చే రుతుపవనాలు ఈసారి వారం ముందుగానే రావడంతో ఆ ప్రభావం జిల్లాపైనా పడింది. ఉపరితలవర్తనం కారణంగా మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆదివారం సాయింత్రం నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అయితే, మంగళవారం నుంచి మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈనేపథ్యాన అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతుంది. ఆదివారం రాత్రి 8–30 గంటల నుంచి సోమవారం ఉదయం 8:30 గంటల వరకు జిల్లాలో సగటున 21.9 మి.మీల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బోనకల్ మండలంలో 76.4 మి.మీల వర్షపాతం నమోదుకాగా, పెనుబల్లి, వేంసూరు మండలాలు మినహా జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. పలు ప్రాంతాల్లో 60 మి.మీలకు పైగా వర్షపాతం నమోదు కావటంతో ఇప్పటికే దుక్కులు దున్నిన రైతులు పత్తి విత్తనాలను నాటేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలోని కొన్నిప్రాంతాల్లో నమోదైన వర్షపాతం (మి.మీ.ల్లో)

మండలం	వర్షపాతం
బోనకల్	76.4
నేలకొండపల్లి	72.6
ముదిగొండ	42.4
మధిర	36.2
ఖమ్మం అర్బన్	28.2
ఖమ్మం రూరల్	26.8
ఏన్కూరు	25.2
ఎర్రుపాలెం	21.8
సింగరేణి	21.2



రాజారాంపేటలో పిడుగుపాటుకు పగిలిపోయిన వాటర్ ట్యాంక్

నేలకొండపల్లిలో పిడుగుపాటు..

నేలకొండపల్లి: మండలంలో ఆదివారం రాత్రి అకాల వర్షాలకు తోడు పలుచోట్ల పిడుగులు పడ్డాయి. దీంతో రాజారాంపేటలో కంటు కొండలు ఇంటిపై పిడుగు పడగా వాటర్ ట్యాంక్ పగిలిపోయి ఇంటి గోడలు నెర్రెలు చాచాయి. ఆ సమయాన కుటుంబ సభ్యులు పక్క గదిలో నిద్రిస్తుండడంతో ప్రమాదం తప్పినట్లయింది. అలాగే, మండలంలోని అనంతనగర్ వద్ద ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలోని ధ్వజస్తంభం కుప్పకూలింది.

వైఎస్.జగన్ మరోసారి సీఎం కావాలని పూజలు



శివాలయంలో అభిషేకం చేయిస్తున్న వైఎస్సార్ అభిమానులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రెండోమారు కూడా సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని ఆకాంక్షిస్తూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అభిమానులు సోమవారం ఖమ్మం జిల్లా కేంద్రంలో పూజలు చేశారు. ఖమ్మం ముస్తఫానగర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్ అభిమాని తుమ్మ అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి పరితపించే జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి తగిన తనయుడిగా పేరొందారని పేర్కొన్నారు. ఆయన మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి ప్రజలకు అండగా నిలవాలని పూజలు చేసినట్లు తెలిపారు. జగన్ పాలనలో లక్షలాది నిరుపేద కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందాయని, మహిళలే కాక అన్ని వర్గాల ప్రజలు జగన్ మరోసారి సీఎం కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మర్రి శ్రీనివాస్, ఆదూరి రాజవర్ధన్‌రెడ్డి, మందడపు వెంకటరామిరెడ్డి, గుండపనేని ఉదయ్‌కుమార్, వాలూరి తిరుపతిరావు, మందడపు వెంకటేశ్వర్లు, గణపరపు సురేష్, యర్రా నాగారాజ్ రెడ్డి, జక్కుల కరుణాకర్, కొదాటి నరసింహరావు, ఉడుగు సుధాకర్, ఎన్నిక వీరస్వామి, నాగుబండి వెంకటేశ్వర్లు, పి.విజయ్‌కుమార్, ఆర్.ప్రభాకర్ రెడ్డి, గంగా రాజు, ఆళ్ల ఉపేందర్‌రెడ్డి, వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం



సన్మానం అందుకున్న ఉద్యమకారులతో ఎమ్మెల్సీ మధు, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ తల్లి, డాక్టర్ బీఆర్.అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ కేసీఆర్ నేతృత్వాన తెలంగాణను సాధించుకోవడమే కాక పదేళ్ల కాలంలో బంగారు తెలంగాణగా తీర్చిదిద్దారని తెలిపారు. కాంగ్రెస్ సకాలంలో తెలంగాణ ఇచ్చి ఉంటే వందలాది మంది ఆత్మ బలిదానం చేసుకుని ఉండేవారు కాదని చెప్పారు. అనంతరం పలువురు ఉద్యమకారులను సత్కరించారు. మాజీ ఎమ్మెల్యేలు బానోతు చంద్రావతి, కొండబాల కోటేశ్వరరావు, మార్కెట్ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో పాటు పగడాల నాగరాజు, వీరూనాయక్, తోట రామారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించిన జాయింట్ ఐజీ



జాయింట్ ఐజీ మధుసూదన్‌రెడ్డిని సత్కరిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ జాయింట్ ఐజీ జి.మధుసూదన్‌రెడ్డి వరంగల్ డీఐజీ ఎం.సుబాషిణి సోమవారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఖమ్మంలో జిల్లా రిజిస్ట్రార్, ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్, చిట్ రిజిస్ట్రార్, ఖమ్మం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించారు. ఆయా కార్యాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లు, లావాదేవీలు, ఇతర అంశాలపై ఆరా తీయడంతో పాటు రికార్డులను తనిఖీ చేశారు. ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఇటీవల నూతన భవనంలోకి మార్చిన నేపథ్యాన అక్కడ వినియోగదారులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చేవారికి నాణ్యమైన సేవలందించాలని అధికారులకు సూచించారు. తొలుత జాయింట్ ఐజీ, డీఐజీకి జిల్లా రిజిస్ట్రార్ చిట్టిమళ్ల అశోక్‌కుమార్ ఆధ్వర్యాన అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వ్యాల్యూ అండ్ ఆడిట్ అధికారి అడపా రవీందర్ బాబు, ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ గంగవరపు నరేందర్, ఖమ్మం ఎస్ఆర్‌ఓ పద్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యకర్తలకు, శ్రేణులకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం కార్యకర్తలు, శ్రేణులకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మతోన్మాద పాలకులు, వారికి కొమ్ముగాస్తున్న కార్పొరేట్ శక్తులు కలిసి సమాజాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల నుండి మత భావాల వైపు మళ్లించే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈనేపథ్యాన పార్టీ శ్రేణులకు వర్తమాన రాజకీయాలు, తదితర అంశాలపై గ్రామ, మండల స్థాయిలో శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఈసందర్భంగా కార్యకర్తలలకు సంపూర్ణ అవగాహన కల్పించడం ద్వారా ప్రజా ఉద్యమాలలో మమేకమై పనిచేసేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు బండారు రమేష్, టీఎల్.నరసయ్య, యర్రా శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు నేడే తెర

21 రోజుల నిరీక్షణ తర్వాత వెల్లడి కానున్న ఎన్నికల ఫలితాలు

నేటి మధ్యాహ్నానికి పూర్తి స్థాయిలో స్పష్టత

- 175 అసెంబ్లీ స్థానాలకు 2,387 మంది, 25 లోక్‌సభ స్థానాలకు 454 మంది అభ్యర్థుల పోటీ
- వైఎస్ జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ఒంటరిగా పోటీ
- బీజేపీ, జనసేనలతో కలిసి కూటమిగా బరిలోకి దిగిన టీడీపీ
- ఓట్ల లెక్కింపు కోసం 33 చోట్ల 401 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు
- ఉదయం 8 గంటల నుంచే లెక్కింపు ప్రారంభం
- ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు.. 45 వేల మంది పోలీసులు, 67 కంపెనీల సాయుధ బలగాల వినియోగం
- పోలింగ్ కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాలతో పహారా

సాక్షి, అమరావతి: ఓటర్ల తీర్పు వెల్లడికి కౌంట్ డౌన్ ప్రారంభమైంది. మరి కొద్ది గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఫలితాలపై గత 21 రోజులుగా రాష్ట్ర ప్రజలు, రాజకీయ పార్టీల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లను, ఆ తర్వాత 8.30 గంటల నుంచి ఈవీఎంలలో నిక్షిప్తం అయిన ఓట్లను లెక్కిస్తారు. ఇప్పటికే విడుదలైన మెజార్టీ సర్వేల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వైఎస్సార్‌సీపీ రెండోసారి అధికారం చేపట్టనుందని తేల్చాయి. గత నెల 13వ తేదీన రాష్ట్ర అసెంబ్లీకి, లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే దేశ వ్యాప్తంగా ఏడు దశల్లో పోలింగ్ నిర్వహించడం, శనివారంతో చివరి దశ పోలింగ్ ముగియడంతో ఫలితాల కోసం జూన్ 4 వరకు వేచి చూడాల్సి వచ్చింది. నేటి మధ్యాహ్నానికి ఫలితాలపై స్పష్టత వస్తుంది. అయితే ఈవీఎం కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు పూర్తి అయినప్పటికీ, ప్రతి నియోజకవర్గంలో ఐదు వీవీప్యాట్‌లలోని స్లిప్‌లను కూడా చివర్లో లెక్కించాల్సి ఉంటుంది. అందువల్ల అధికారికంగా ఫలితాల ప్రకటనకు కొంత జాప్యం అవుతుంది.



మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

ఫలితాలు ఇలా తెలుసుకోవచ్చు..

ఎన్నికల సరళిని, ఫలితాలను ఎప్పటికప్పుడు తెలియచేసేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. లెక్కింపులో ఒక రౌండు పూర్తి కాగానే ఆ ఫలితాలను కౌంటింగ్ సెంటర్ వద్ద మైక్‌లో వెల్లడించడంతో పాటు, మీడియా ప్రతినిధులకు కనపడే విధంగా డిస్‌ప్లే బోర్డులను కూడా ఏర్పాటు చేసింది. ప్రతి రౌండు ఫలితాలను సువిధా యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. నియోజకవర్గ ఫలితాలతో పాటు దేశ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల ఫలితాలను తెలుసుకోవడానికి ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను, యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

https://results.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫలితాలు తెలుసుకోవచ్చు. దీంతోపాటు 'ఓటర్స్ హెల్ప్‌లైన్' అనే యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ఎన్నికల ఫలితాల సరళిని తెలుసుకోవచ్చు.

తొలి ఫలితం కొవ్వూరు, నరసాపురం

రాష్ట్రంలో మొత్తం 4.13 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ఇందులో ఈవీఎంల ద్వారా 3.33 కోట్ల మంది, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 5.15 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా రికార్డు స్థాయిలో 81.8 శాతం ఓటింగ్ నమోదైంది. 175 అసెంబ్లీ స్థానాలకు 2,387 మంది, 25 లోక్‌సభ స్థానాలకు 454 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఓట్ల లెక్కింపు కోసం 33 చోట్ల 401 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ తర్వాత కొన్ని చోట్ల హింసాత్మక సంఘటనలు చేటు చేసుకోవడంతో, ఓట్ల లెక్కింపు సందర్భంగా అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు 111 అసెంబ్లీ స్థానాల్లో 5 – 6 గంటల్లోనే పూర్తి కానుంది. 61 నియోజకవర్గాల్లో 6 – 8 గంటలు, మూడు నియోజకవర్గాల్లో 9 – 10 గంటల సమయం పట్టనుంది. పార్లమెంటు ఫలితాలకు సంబంధించి 13 రౌండ్లు ఉన్న రాజమండ్రి, నరసాపురం ఫలితాలు తొలుత వెల్లడి కానుండగా, 27 రౌండ్ల లెక్కింపు ఉన్న అమలాపురం ఫలితం ఆలస్యంగా రానుంది. అసెంబ్లీ విషయానికి వస్తే కేవలం అయిదు గంటలలోపే తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, నరసాపురం ఫలితాలు.. ఆలస్యంగా భీమిలి, పాణ్యం ఫలితాలు వెల్లడి కానున్నాయి.

ఒంటరిగా సిద్ధం

వైఎస్సార్‌సీపీ ఎవరితో పొత్తు లేకుండా ఒంటరిగానే 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసింది. తెలుగుదేశం పార్టీ జనసేన, బీజేపీలతో జట్టు కట్టి కూటమిగా పోటీలో నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం పేరుతో ముందస్తుగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోగా, తెలుగుదేశం పార్టీ సీట్ల పంపకం, అభ్యర్థుల ఎంపికపై సిగపట్లు పడుతూ ప్రచారంలో వెనుకబడ్డారు. టీడీపీ 144 అసెంబ్లీ, 17 పార్లమెంటు స్థానాల్లో, భారతీయ జనతాపార్టీ ఆరు పార్లమెంటు, 10 అసెంబ్లీ.. జనసేన రెండు పార్లమెంటు, 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ పడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాల్లో సామాన్యులను అభ్యర్థులుగా నిలబెట్టగా, తెలుగుదేశం పార్టీ పొత్తులు పెట్టుకొని తమ పార్టీకి చెందిన అభ్యర్థులను బీజేపీ, జనసేనల్లోకి పంపి అభ్యర్థులుగా నిలబెట్టింది.

మన పార్టీ కార్యకర్తలు గొప్ప పోరాట స్ఫూర్తిని చాటారు

ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలందరూ గొప్ప పోరాట స్ఫూర్తిని చాటారని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కౌంటింగ్ ప్రక్రియలో కూడా అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ.. ప్రజలు మనకు వేసిన ప్రతి ఓటునూ మన పార్టీ ఖాతాలోకి వచ్చేలా అప్రమత్తంగా వ్యవహరించి మన పార్టీకి అఖండ విజయం చేకూరుస్తారని ఆశిస్తున్నానని చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో(ట్విట్టర్)లో పోస్టు చేశారు.

– సాక్షి, అమరావతి

ఫ్యాను గాలి వీచింది.. వైఎస్సార్‌సీపీదే విజయం

'సాక్షి' టీవీ చర్చలో ప్రముఖ సెఫాలజిస్టులు స్పష్టీకరణ



- సీఎం జగన్ అందించిన సంక్షేమం, సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీకి సానుకూలంగా మారింది: ఆరా మస్తాన్
- 126 స్థానాలకంటే వైఎస్సార్‌సీపీకి అధికంగా వస్తాయి: ఆత్మసాక్షి మూర్తి
- సీఎం జగన్ చేసిన మంచికి కృతజ్ఞతలు చెబుతూ ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారు: రేస్ కిషోర్
- అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకూ ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే : ఫస్ట్ స్టెప్ సొల్యూషన్స్ ఇంద్ర నీల్

సాక్షి, అమరావతి: రాష్ట్రమంతా ఫ్యాను గాలి ఉధృతంగా వీచిందని, ఓటర్లలో అధిక శాతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని, ఆ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ప్రముఖ సెఫాలజిస్టులు స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో 50 శాతం కంటే ఎక్కువ ఓట్లతో అత్యధిక శాసన సభ, లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని తేల్చి చెప్పారు. 'సాక్షి' టీవీ సోమవారం రాత్రి నిర్వహించిన చర్చలో ప్రముఖ సెఫాలజిస్టులు 'ఆరా' మస్తాన్, 'ఆత్మసాక్షి' మూర్తి, 'రేస్' కిషోర్, 'ఫస్ట్ స్టెప్ సొల్యూషన్స్' ఇంద్రనీల్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ సానుకూల ఓటుతో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించి అధికారంలోకి వస్తోందని వారంతా స్పష్టం చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎమ్మెల్సీ రఘురాజుపై అనర్హత వేటు

- టీడీపీతో కుమ్మక్కై వైఎస్సార్‌సీపీకి వ్యతిరేక కార్యకలాపాలు
- ఆయన సభ్యత్వాన్ని రద్దుచేసిన మండలి చైర్మన్ మోషేన్‌రాజు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టు సాక్ష్యాలు బట్టబయలైన నేపథ్యంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై అనర్హత వేటు పడింది. ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దుచేస్తూ, ఆ స్థానం ఖాళీ అయిందని పేర్కొంటూ సోమవారం మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాలను ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురించారు. ప్రత్యర్థి పార్టీ టీడీపీతో కుమ్మక్కై వైఎస్సార్‌సీపీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపైన, పార్టీ నాయకులపైన అనుచిత వ్యాఖ్యలు చేశారని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. స్వయంగా హాజరై దీనిపై వివరణ ఇవ్వాలని నాలుగుసార్లు నోటీసులు పంపించినా రఘురాజు డుమ్మాకొట్టారు. మూడు నెలల కిందటే రఘురాజు భార్య, ఎస్.కోట వైస్ ఎంపీపీ ఇందుకూరి సుబ్బలక్ష్మి అలియాస్ సుధారాజు టీడీపీ నేత లోకేశ్ సమక్షంలో ఆ పార్టీ కండువా వేయించుకున్నారు. టీడీపీ ఎస్.కోట అభ్యర్థి కోళ్ల లలితకుమారితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. రఘురాజు దంపతుల నివాసంలోనే టీడీపీ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. మరోవైపు కోళ్ల లలితకుమారికి, ఎస్.కోట టికెట్ కోసం విఫల యత్నం చేసిన గొంప కృష్ణకు మధ్య సయోధ్య కుదిర్చేందుకు హైదరాబాద్‌లో లోకేశ్ సమక్షంలో జరిగిన పంచాయితీలో మండల టీడీపీ నాయకులతో కలిసి రఘురాజు పాల్గొన్నారు. ఇలా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దుచేయాలని ప్రభుత్వ విప్ విక్రాంత్ ఫిర్యాదు చేశారు. రఘురాజు 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2027 వరకు పదవీ కాలం ఉన్నా పార్టీ వ్యతిరేక కలాపాలకు పాల్పడటంతో ఆయన సభ్యత్వం రద్దయింది.

జిల్లా వార్తలు

తగ్గిన కిన్నెరసాని నీటిమట్టం


కిన్నెరసాని జలాశయం

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని జలాశయంలో నీటి నిల్వ తగ్గిపోతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయంలో సోమవారం 395.60 అడుగులుగా నీటి మట్టం నమోదైంది. గతేడాది ఇదేరోజున 397.50 అడుగులుగా నీరు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక్కడి నుంచి కేటీపీఎస్, కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతోపాటు, ఎన్ఎండీసీ, నవభారత్ కర్మాగారాలకు నిత్యం 120 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

శ్రీ అద్భుత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఏన్కూరు: మండలంలోని నాచారంలో శ్రీ అద్భుత వెంకటేశ్వరస్వామి ఆలయ 22వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి ఆలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, పద్మావతి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి మేలుకొలుపు, సుప్రభాత సేవ, పుణ్యావాచనం, రక్షాబంధనం, 108 కళశాలతో అభిషేకం తదితర పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటుచేశారు. ఈఓ శేషయ్య, ప్రధానార్చకులు సీహెచ్.శ్రీనివాసచార్యులు, తిరుమల సత్యనారాయణాచార్యులు పాల్గొన్నారు.

7న ఫుట్‌బాల్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని మున్సిపల్ క్రీడా మైదానంలో ఈనెల 7వ తేదీన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన వేసవి శిబిరంలో పాల్గొన్న అండర్– 14 క్రీడాకారుల కోసం ఈ టోర్నమెంట్ ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. క్రీడాకారులు ఎంట్రీలను ఈనెల 5లోగా అందజేయాలని, పూర్తి వివరాలకు 99896 47696 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కిన్నెరసాని డ్యామ్‌పైకి దారి మూసివేత

పాల్వంచరూరల్: రెండు శాఖల అధికారుల సమన్వయ లోపం కారణంగా పర్యాటకులు ఇక్కట్లు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. పాల్వంచ మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని డ్యాం పైకి ఆదివారం వెళ్లిన ఓ మహిళ రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో జెన్‌కో అధికారులు సోమవారం డ్యామ్‌పైకి పర్యాటకులు రాకుండా అడ్డంగా కంచె ఏర్పాటుచేసి గేటుకు తాళం వేశారు. దీంతో ప్రకృతి అందాలను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు నిరాశ చెందుతున్నారు. కాగా, రిజర్వాయర్ పర్యవేక్షణ జెన్ అధికారులు, డీర్‌పార్కును వైల్డ్‌లైఫ్ శాఖ, రిజర్వాయర్‌లో బోట్ షికారును టూరిజం శాఖ పర్యవేక్షిస్తోంది. పర్యాటకుల దగ్గర నుంచి టికెట్ డబ్బులు వసూలు చేసి పార్కులోకి అనుమతిస్తుండగా, పార్కులోని జంతువులు, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని తిలకిస్తారు. అయితే, ఓ మహిళ డ్యామ్‌పైకి వెళ్లి జలాశయంలో దూకగా సిబ్బంది సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఒకవేళ ప్రమాదం జరిగితే దానికి పోలీసులు జెన్‌కో అధికారులను బాధ్యులుగా చేయనుండగా, పర్యాటకులకు అనుమతి నిరాకరిస్తున్నట్లు ఏడీఓ రామకృష్ణ తెలిపారు. కాగా, కిన్నెరసానిలోకి వచ్చే పర్యాటకుల నుంచి టికెట్ల పేరిట వైల్డ్‌లైఫ్ శాఖ డబ్బులు వసూలు చేస్తుండగా ప్రమాదం జరిగినప్పుడు జెన్‌కో అధికారులపై కేసులు పెడుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై వైల్డ్‌లైఫ్ శాఖ అధికారులు స్పందిస్తూ పర్యాటకులు పార్కులోకి ప్రవేశించాక డ్యామ్‌పైకి రాకుండా ఎలా ఉంటారని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి సూచనలు వస్తేనే అనుమతి నిలిపేసే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పడం గమనార్హం. ఏది ఏమైనా రెండు శాఖల సమన్వయ లోపంతో పర్యాటకులకు ఇబ్బందులకు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది.



డ్యామ్‌పైకి వెళ్లే మార్గంలో జెన్‌కో అధికారులు వేసిన కంచె (ఇన్‌సెట్) డ్యామ్‌పై గేట్‌కు తాళం వేసి ఏర్పాటు చేసిన బోర్డు

477 కేజీల గంజాయి పట్టివేత


స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు చూపిస్తున్న పోలీసులు

- మామిడికాయల మాటున రవాణా
- పట్టుబడిన గంజాయి విలువ రూ.1.19. కోట్లు

మణుగూరు టౌన్: మామిడికాయ బస్తాల మాటున తరలిస్తున్న రూ.1.19 కోట్ల విలువైన 477 కిలోల గంజాయిని మణుగూరు పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. డొంకరాయి నుంచి జహీరాబాద్‌కు ట్రాలీలో గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు మణుగూరులోని హనుమాన్ ఆలయం వద్ద ఎస్ఐ మేడ ప్రసాద్ సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు ముందు కారులో, వెనుక మామిడికాయలు తరలిస్తున్న ఓ ట్రాలీలో మరో ముగ్గురు వస్తుండగా పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ట్రాలీలో మామిడికాయల మధ్యన గంజాయి ప్యాకెట్లు ఉంచి తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో యాదాద్రి జిల్లాకు చెందిన చెరుకుపల్లి శ్రీకాంత్, గుమ్మడెల్లి అర్జున్, మోతుగూడేనికి చెందిన పంగి సునీల్, ఇల్లెందుకు చెందిన రాయకంటి నాగరాజు, ఎజ్జు సృజన్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామమని సీఐ వివరించారు. శ్రీకాంత్‌పై ఇప్పటికే 14 కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. ట్రాలీతో పాటు కారు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఖమ్మం వాసికి డాక్టరేట్


సురేష్‌కుమార్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం రాపర్తినగర్‌కు చెందిన తేరాల వెంకట సురేష్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. ఆయన డాక్టర్ ప్రభు, జి.బివకాప్ పర్యవేక్షణలో 'స్టడీ అండ్ అనాలసిస్ ఆఫ్ రౌటింగ్ ఆల్గోరిథమ్స్ ఇన్ మానెట్ విత్ ది హెల్ప్ ఆఫ్ ట్రస్ట్ గ్రూప్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రకటించింది. సురేష్‌కుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

అనంతారం వాసికి..


ఇనుకొండ రవీంద్రం

కొణిజర్ల: కొణిజర్ల మండలం అనంతారం గ్రామానికి చెందిన ఇనుకొండ రవీంద్రంకు చరిత్ర పరిశోధనలో డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ వడ్డానం శ్రీనివాసరావు పర్యవేక్షణలో 'తెలంగాణలో కులం రాజకీయాలు, అధికారం – ఖమ్మం జిల్లాపై ఒక అధ్యయనం (1956–2024)' అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ ప్రకటించారు.

గిరిజన మహిళలు | ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ఆదివాసీ గిరిజన మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఎంఎస్ఎంఈ యూనిట్, చిన్న తరహా పరిశ్రమ ద్వారా తయారు చేసిన సబ్బులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గిరిజన మహిళలు తయారు చేసిన ఆరు రకాల సబ్బులు, షాంపూలను ఐటీడీఏ కార్యాలయంలో అమ్ముకునేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. మహిళలు ఖాళీగా ఉండకుండా చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి ఆర్థికాభివృద్ధి సాధించడమే కాక మరికొందరికి ఉపాధి కల్పించాలని సూచించారు. కాగా, సబ్బులు, షాంపూలతో పాటు ఓంశక్తి మహిళా గ్రూపు సభ్యులు తయారు చేసే సెంట్ ఫినాయిల్, కొవ్వొత్తులు, సర్ఫ్ అందుబాటులో ఉన్నందున ప్రజలు కొనుగోలు చేసి మహిళలకు తోడ్పాటునివ్వాలని కోరారు. ఈ సందర్భంగా పలు వస్తువులను పీఓ కొనుగోలు చేశారు.


మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

పీసా గ్రామ సభలను నిర్వహించాలి

ఏజెన్సీ ఏరియాలో పీసా చట్టం ప్రకారం తప్పకుండా గ్రామసభలను నిర్వహించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. ఇటీవల ములుగు జిల్లా వెంకటాపురం మండలం చుక్కల గ్రామంలో ఇసుక కాంట్రాక్టు ఇచ్చేందుకు నిబంధనలకు విరుద్ధంగా గ్రామసభ జరిగినట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఇక నుంచి పొరపాట్లు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

బెండకాయ అగ్గువ..!

కిలో రూ.10 నుంచి రూ.15కే విక్రయం

ఖమ్మంవ్యవసాయం: పది రోజుల క్రితం కిలో రూ.60 వరకు పలికిన బెండకాయ ధర ఒక్కసారిగా పడిపోయింది. ప్రస్తుతం రూ.10 నుంచి రూ.15గా పలుకుతోంది. రైతు బజార్లలో కిలో రూ.18 చొప్పున విక్రయిస్తుండగా, రహదారుల వెంట రైతులు నేరుగా అంతకంటే తక్కువే అమ్ముతున్నారు. ఒక్కసారిగా పంట చేతికందడంతో హోల్‌సేల్‌లో ధర పడిపోయినట్లు తెలుస్తోంది. హోల్‌సేల్ మార్కెట్‌లో వ్యాపారులు క్వింటాకు ధర రూ.500 నుంచి రూ.600కు మించి చెల్లించకపోవడంతో రైతులే నేరుగా రహదారుల వెంట విక్రయిస్తున్నారు. జిల్లాతోపాటు సమీప జిల్లాల రైతులు సైతం ఖమ్మంలోని గాంధీచౌక్, మయూరి సెంటర్, బస్టాండ్లు, ఇల్లెందు క్రాస్ రోడ్ తదితర ప్రాంతాల్లో సోమవారం విక్రయిస్తుండడం కనిపించింది. బీర, కాకర, పచ్చిమిర్చి వంటి కూరగాయల కిలో ధర రూ.60 నుంచి రూ.120 వరకు పలుకుతుండగా, బెండకాయల ధర పడిపోవడంతో కొనుగోళ్లకు ప్రజలు, హోటళ్ల నిర్వాహకులు ఆసక్తి కనబరుస్తున్నారు.




ఖమ్మం గాంధీచౌక్ వద్ద బెండకాయలు విక్రయిస్తున్న రైతులు

కనీస ధర లేక..



హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో బెండకాయకు ధర లేదు. దీంతో వీధుల వెంటే విక్రయించాల్సి వస్తుంది. ఎండలో ఇబ్బంది పడుతూ పంట పండించినా ప్రయోజనం లేదు. హోల్‌సేల్ మార్కెట్‌లో అతి తక్కువ ధరకు అడిగారు. అక్కడ అమ్మడం ఇష్టం లేక పెట్టుబడులైనా వస్తాయనే మేమే నేరుగా విక్రయిస్తున్నాం.

– తేజావత్ దాస్, బొద్రాయి తండా, మహబూబాబాద్ జిల్లా